# అదృష్టహీనులు

## జయంతి శ్రీరామమూర్తి

అప్పుడే పెద్దవాన కురిసి వెలిసింది. ఒక గంటసేపు వరుణదేవుడు భూదేవిమీద ఆగ్రహించేడా అనిపించింది. చెట్లూ చేమలూ నీళ్లతో ఏకమైపోయాయి. కలుగుల్లో దాగివున్న సర్పాలకు తడివల్ల ఇబ్బంది కలిగినా, పైకి రాబోయే కప్పలను తలచుకొని అవి నోరు తడిచేసుకొంటున్నాయి. చెట్ల ఆకులమీది నీటిబిందువులింకా టపటపా రాలుతూనే వున్నాయి. పడమటి కొండలవైపు పరుగులంకించుకున్న సూర్యుడు వెనుతిరిగి చూడడంలేదు. ఆ సమయాన వినోదరావు తన బంగళాలో డ్రాయింగు రూములో సోఫామీద కూర్చుని తుపాకీ తుడుచుకుంటున్నాడు. మధ్యమధ్య కిటికీలోంచి గేటువైపు తొంగిచూస్తున్నాడు. ఆయన వేటనిమిత్తం జోధ్‌పురీ సూటు వేసుకుని సిద్ధంగా వున్నాడు. ఆయన ఊరబుగ్గలమీది కోరమీసాలు అప్పుడే చాకలివాడు ఉతికి మెలిపెట్టిన గుడ్డల్లా మెరుసుకుని వున్నాయి. వాటి చివర ఆయన రాసుకున్న అగరుసెంటు సువాసనలు కిటికీ అద్దాలు తుడుస్తూన్న రామన్న అనుభవిస్తున్నాడు. అతడు పదేపదే తనకేసి చూస్తూండడం సహించలేకనో యేమో వినోదరావు "రామన్నా! ఈవేళ నా జోళ్ళు పాలిష్ చెయ్యలేదా?" అన్నాడు.

"చెయ్యకేం బాబయ్యా! రోజూ నా మొట్టమొదటిపనదే గదండీ, మరచిపోతానా?" అన్నాడు రామన్న.

"అయితే, యింత చక్కగా వున్నాయేం, నీమొహంలాగ." అన్నాడు యజమాని బూరాకంఠంతో.

రామన్న మారుమాటాడక, లోనికి పరుగెత్తి పాలిష్ సామానులు తెచ్చి, వినోదరావుకాళ్లు తనతొడమీద పెట్టుకుని బాగా మెరిసేదాకా జోళ్లు తోమేడు. అంతసేపూ బాగా ఆనందం అనుభవించేడో యేమో, ఆయన కళ్ళుమూసుకుని మీసాలు మెలిపెడుతూ మధ్యమధ్య తనలో తాను నవ్వుకుంటూ, ఆనాడు తాను చంపబోయే మృగాలను తలచుకుంటూ చిటికెలు వేస్తూ వున్నాడు. రామన్న మళ్లీ తనపనిలో నిమగ్నుడయ్యేడు-వినోదరావు కళ్లు తెరచి,—

"విశ్వాసరావు రాలేదేం యింకా?" అన్నాడు.

రామన్న ఆత్రంతో చూస్తూ,—

"విశ్వాసరావు వస్తారండీ! టీ పెట్టమంటారా?" అన్నాడు

"నీతలకాయ! వాడికి టీ యేమిటిరా? మనకన్న పెద్దవాళ్లకి గాని, చిల్లరవాళ్ళకి టీమాట తలపెట్టవద్దని ఎన్నిసార్లు చెప్పాలి నీకు? నీది మట్టిబుర్ర" అన్నాడు యజమాని.

"చిత్తం" అన్నాడు పనివాడు.

ఇంతలో బయట తలుపుమీద టక్కుటక్కున యెవరో వేళ్ళతో కొట్టిన శబ్దం కాగా, "కమిన్" అన్నాడు వినోదరావు.

విశ్వాసరావు మెల్లగా లోనికి వచ్చి "నమస్కారం" అన్నాడు.

వినోదరావు చేతిగడియారం చూస్తూ "ఇప్పుడు ఎంత టైం అయింది" అన్నాడు.

విశ్వాసరావు "నాదగ్గర గడియారం లేదండి."

"గడియారం వుంటే మహా కరెక్టుగా టైముకి వచ్చేటట్టు. తల్లి పుట్టిల్లు మేనమామకి తెలియదా! ఈవేళా నిన్నా కాదు, పదేళ్ళ నుంచి చూస్తున్నాను మిమ్మల్ని. టైము సెన్సు ఎంతమాత్రమూ లేదు. ఇక ప్రమోషన్ రాలేదని అరచి యేం లాభం?" అని దులిపేసేడు అధికారి.


విశ్వాసరావు వర్షంవల్ల ఆలస్యమైందని చెబుదామనుకున్నాడు కాని, ఎందువల్లనో అతని కంఠం పని చెయ్యలేదు.

వినోదరావు తుపాకీ బెల్టు మెడలో వేసుకుని లేచేడు. బయటకు వచ్చి, గరేజిలో నుంచి తన మోటారుకారు తీసి, విశ్వాసరావుని వెనక సీటులో ఎక్కించుకుని బయలుదేరేడు. కారు తానే నడుపుతూ, తారు రోడ్డుమీద జారుగా పోనిస్తున్నాడు. విశ్వాసరావు తన అధికారిని చూస్తూ, స్టీరింగ్ చక్రంమీది అతని వేళ్ళమీద దృష్టి నిలిపి తన ఆలోచనలలో తానున్నాడు. నిజానికి ఆ వేళ్లే విశ్వాసరావు జీవితాన్ని కూడా నడిపిస్తున్నవి.

వినోదరావూ, విశ్వాసరావూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. ఒకే వయసువాళ్లు. ఒకే చదువుగలవాళ్లు. కాని విశ్వాసరావు వినోదరావుక్రింద పనిచేస్తున్నాడు. అతని జీతం నెలకి రెండు వందలు. అధికారి జీతం దీనికి పదిరెట్లు. అంతమాత్రాన వినోదరావు పదిరెట్లు తెలివిగలవాడనుకోరాదు. నిజానికి ఆఫీసుపని అంతా విశ్వాసరావే చేస్తాడు. కాని మెప్పంతా వినోదరావుకి లభిస్తుంది అది దేశకాల పరిస్థితుల మహిమ. కీలకం యెక్కడుందో తెలియక విశ్వాసరావు యేటేటా తికమక పడుతుంటాడు. తెలుసుకుని వినోదరావు పైకెగబ్రాకి పోతుంటాడు. గడచిన సంవత్సరం ప్రమోషన్ విశ్వాసరావుకి అతి సమీపంలోకి వచ్చింది. కాని వినోదరావు అతని రిపోర్టుమీద ఎర్రసిరా కురిపించడంవల్ల మళ్ళీ దూరంగా పారిపోయింది. విశ్వాసరావు చాలా బాధపడ్డాడు. కాని ఆ బాధ అధికారి కెందుకు? తనతో అనవసరపు భేదాభిప్రాయాలు పెట్టుకున్నాడు కనక అనుభవించవలసిందే! చిన్న పనివాడికే అంత స్వాభిమానంవుంటే, పెద్ద ఆఫీసరుకి తనకుండదూ?

నిజానికి విశ్వాసరావు చాలా విచారించేడు. తన సంసారం క్షేమాన్ని గురించి అయినా తాను లొంగిపడివుండవలసింది. మనిషి గౌరవానికీ అతని ఆదాయానికీ అవినాభావ సంబంధంవున్న యీరోజుల్లో, తానంత అవివేకంగా ప్రవర్తించేనని తన్ను


సుగంధికా సరస్వతీ తైలము



మెదడుకు, చల్లదనముకు, కన్ను, ముక్కు, చెవి, వ్యాధులకు, 32 సం॥ నుండి ప్రపంచమంతటావాడుచున్నారు
ఒకసారివాడినతెలియును
మీ పెద్దడీలర్లఅందరి వద్ద దొరుకును

ఈష్టర్న్ మెడికల్ వర్క్సు
కాకినాడ.

డిస్ట్రిబ్యూటర్లు సీతారామ్ జనరల్ స్టోర్సు
(ఏజెన్సీస్,) విజయవాడ -1

లాను తిట్టుకున్నాడు. కాని చేతులు కాలిన మీనట ఆకులు పట్టుకుని యేమి లాభం? అందుకే ఈయేడు మళ్ళీ రిపోర్టుల సీజను వచ్చింది గనక వినోదరావు ఏం చెబితే అది చేయడానికి సిద్ధపడ్డాడు. అతడు కుందేలుకి మూడే కాళ్ళంటే - 'చిత్తం! యింకా రంగేసుమండీ!' అంటాడు. ఆయన 'భూమి గుండ్రంగా లేదం'టే - 'అబ్బే, వుందని యెవరన్నారు? శుద్ధతప్పు' అంటాడు. గత కాలపు అనుభవాలను జీర్ణించుకున్న విశ్వాసరావు ఈసంవత్సరం అధికారి ప్రాపకాన్ని చాలామట్టుకు సంపాదించుకున్నాడు. ఈనెలలో రిపోర్టులు రావాయి, ముందు నెలలో ప్రమోషన్ రావచ్చును! అందుకే ప్రమాదంతో గూడిన పనైనా అప్పుడప్పుడు అధికారితో వేటకి గూడా వెడుతున్నాడు తోడుగా.

వినోదరావు వేటంటే చెవికోసుకుం



టాడు. అవసరమైతే అన్నం లేకుండా నెల్లాళ్ళు వుండగలడు, కాని వేటాడందే పదిరోజులు గడవవు. ఏదీ దొరక్కపోతే ఆఖరికి ఒక్కపావురాయైనా పడెయ్యాలి. అంతమాత్రాన ఆయన జాలిలేనివాడనీ అనుకోరాదు. తనతుపాకీ గుండుకి నేలరాలి మరణవేదనతో కొట్టుకొనే జంతువులయెడ, పక్షులయెడ ఆయనకెంతో జాలి. ఏ కొన ప్రాణంవున్నా బ్రతికిద్దామని ప్రయత్నిస్తాడు. ఆమధ్య నొక పొడలదుప్పి గుండు తొడలోనుంచి దూసుకుపోయి పడిపోయింది. వినోదరావు వెంటనే దాన్ని కారులో యెక్కించుకొని, పశువులడాక్టరు వద్దకు తీసుకుపోయి కట్టుకట్టించేడు. దానికి భూమ్మీద నూకలు లేక మూడోనాటికల్లా ఆయన కూరగా మారింది గాని, లేకుంటే ఆయన దాన్నెంతో ముద్దుగా పెచుంకుందా మనుకున్నాడు.

కారు స్పీడుగా పోతూంది. రోడ్డుపక్కనున్న చెట్లు గబగబా వెనక్కి పరుగెత్తుతున్నాయి. ఆ చెట్లమీది నెంబర్లు చదువుదామని విశ్వాసరావు ప్రయత్నించేడు కాని వీల్లేకపోయింది. ఆపైన రోడ్డు వంకర తిరుగుతోంది. అది సూచించే బోర్డు ఒకటి అతని కంటబడింది. అంతే. ఆ మరుక్షణాన ఏం జరిగిందో అతనికి తెలియదు. అతనికి తెలివి వచ్చి చూచేసరికి ఏమీ బోధపడలేదు. శరీరమంతా తిమ్మిరెక్కి పట్టుతప్పినట్లు తోచింది. శరీరంలో యే భాగమైనా లోపించిందేమోనని అంతా కలయచూసుకున్నాడు. అన్నీ సరిగానే వున్నాయి. లేచి నిలబడ్డాడు. కాస్త నడిచేడు. అధికారికోసం కలయజూసేడు. కారు ఒక చెట్టు కంటి పెట్టుకుని తప్పుబడిన లేకముద్దలా వుంది. అధికారి కఠోరభూభాగంమీద విగతజీవిలా పడివున్నాడు. ఎన్నో ప్రాణాలను సునాయాసంగా తీసివేసిన తుపాకీ ముక్కముక్కలై ప్రక్కన పడివుంది. విశ్వాసరావు అధికారి ముక్కుదగ్గర చెయ్యి పెట్టి చూసేడు. ఊపిరి ఆడుతోంది. వెంటనే పోయి రోడ్డుప్రక్క పంటకాలువలోనివి ఇన్ని నీళ్లు తెచ్చి మొహాన కొట్టేడు. వినోదరావు తెలివి వచ్చి జాలిగా చూసి లేవబోయి కాలు పట్టుకుని వెనక్కి పడిపోయాడు. విశ్వాసరావు అతని ఎడమకాలి జోధపురీ సూటుగుడ్డ బొత్తాములు విప్పి పైకెత్తేడు. ఒక్కసారిగా హడలిపోయాడు. ఒక ఎముక విరిగి బయటకు పొడుచుకువచ్చింది. వినోదరావు మాటలేకుండా జాలిగా చూస్తున్నాడు. విశ్వాసరావు కేమి చెయ్యడానికీ తోచలేదు. ఇంతలో ఎదురుగా ఒక లారీ వస్తూ ఈ దృశ్యాన్ని చూసి అక్కడ ఆగిపోయింది. విశ్వాసరావూ, లారీడ్రైవరూ కలిసి వినోదరావుని లారీలోకి మోసేరు సరాసరి అతన్ని జనరల్ ఆసుపత్రిలో చేర్చేరు.

అతనిని ఆఫీసర్ వార్డులో పడుకో బెట్టేరు. ఆ వార్డు నిజానికి ఇంద్రభవనంలా వుంది. గదిలో కుండీలలోవున్న పూల మొక్కలు ఘుమ్మని పరిమళిస్తున్నాయి. కాని, కాలు విరిగిన వినోదరావు నరకంలో వున్నట్లే బాధపడుతున్నాడు. విశ్వాసరావు మొహం మాసి చిన్నపిల్లవానిలా వలవలా యేడుస్తున్నాడు.

"అదే సరిపోతుంది. బెంగ పెట్టుకోకండి" అని విశ్వాసరావు ఓదార్చేడు.

"చూడు. చావుబ్రతుకుల అంతరం గరిక వాసి లేదు. బ్రతికున్న నాలుగురోజులూ మనంతవాడు లేడనుకుంటాం. మనరోజు తప్పితే ఎంతవాడైనా యింతేగదా?" అన్నాడు యజమాని.

ఆరాత్రే విరిగిన యెముక సర్దేసి కట్టు కట్టేరు. వినోదరావు భార్యవచ్చి భర్తను కంటికి రెప్పలా కాచుకుంటూంది. అధికారిని చూడడానికి జనం తండోపతండాలుగా వచ్చి పోతున్నారు. విశ్వాసరావు ఆరాత్రి తెల్లవార్లూ కంటిమీద కునుకుతీయలేదు. గంటగంటకూ లేచి అధికారిని చూస్తూనే వున్నాడు. అధికారికి సమస్తోపచారాలూ అతడే చెయ్యవలసి వచ్చింది.

మూడోరోజుకి మెల్లగా కాలికి వేసిన ప్లేస్టరు గట్టిపడేసరికి వినోదరావుకి ధైర్యం వచ్చింది. మెల్లగా కూనిరాగాలు ప్రారంభించేడు. షేవు చేయించుకుని మీసాలు దువ్వడం మొదలుపెట్టేడు. విశ్వాసరావు మీద మెల్లగా అధికారం చెలాయించడం ఆరంభించేడు. "వినోదరావు అదృష్టంవల్లనైతేనేమి, విశ్వాసరావు చేసిన ఉపచారాలవల్లనైతేనేమి, మెల్లగా వినోదరావు తేరుకొంటున్నాడు" అనుకొన్నారు ప్రజలు.

ఒకటిన్నర నెల గడిచింది. వినోదరావు మెల్లగా కర్రపట్టుకుని నడుస్తున్నాడు. కారు చెడిపోయిన విచారం ఏమీ లేకుండా ఇన్సూర్యెన్సువాళ్లు పూర్తిసొమ్ము చెల్లించుకున్నారు. దానితో మళ్ళీ కారుకొందామని వినోదరావు ప్రయత్నం చేస్తున్నాడు. అన్నీ లక్షణంగానే వున్నాయి. సెలవు కూడా పొడిగించి హాయిగా వున్నాడు.

విశ్వాసరావుకి ఎప్పటిలాగా ప్రమోషన్ చేజారి, తనకన్న జూనియరు వ్యక్తిజేబులో పడిపోయింది. కారణం తిరిగి వినోదరావు యిచ్చిన చెడ్డరిపోర్టే నని తెలుసుకుందుకు ఆట్టే సేపు పట్టలేదు. విశ్వాసరావుకి తల కొట్టేసినట్లయింది. నిద్రాహారాలు మాని అధికారికి ఇంత చేసినా కడకు "తివిరి యిసుమున తైలంబు దీయవచ్చు"—అన్న విధంగా పరిణమించింది. ఇంతకీ చెడ్డరిపోర్టు పొందడానికి తాను చేసిన తప్పేమిటి? ఈ మాట అధికారినే అడుగుదామని ఒక సాయంత్రం బయలుదేరేడు విశ్వాసరావు.

అధికారి యింట్లో అడుగు పెడదామనుకునేసరికి లోపల తననుగురించిన మాటలేవో వినబడడంవల్ల ఆగిపోయేడు.

"విశ్వాసరావు మళ్ళీ రావడం మానేసేడు ఈమధ్య" అని వినోదరావు.

"వస్తారు పాపం మీవిషయంలో ఎంత కష్టపడ్డారో గదా!" ఆయన భార్య కాబోలు.

"కష్టపడకేం జేస్తాడు—నా క్రింద పని చేస్తూ? లేకుంటే నల్లిని నలిపేసినట్లు నలిపెయ్యనూ?"—

విశ్వాసరావు కాళ్లు చల్లబడ్డాయి. తానతనికి మనిషికి మనిషిలా సాయబడ్డాడు కాని, అధికారి అనే భయంచేత కాదు. కాలు విరిగిన రాత్రి వచ్చిన ధర్మచింతన అంతా ఏమయింది?

"ఏమన్నా పాపం, మీ కాయన చాలా సేవ చేసేడు కాలు విరిగినప్పుడు మిమ్మల్ని అక్కడ వదిలేసి వెళ్లిపోతే మీరేం చేసేవారు?" అన్నది భార్య తిరిగి.

"ఏడిశాడు. అసలీ దురదృష్టమంతా వాడిదే. వాడితో వెళ్లేను గనుక నే నాకీ గతి పట్టింది" వినోదరావు.

విశ్వాసరావు వెనక్కి నడక ప్రారంభించి "అవును. వాడి దురదృష్ట జాతకం. లేకుంటే ఏనాడు నాకు ప్రమోషన్ రావలసినమాట!" అనుకుంటూ యింటికి వెళ్లిపోయేడు.

తిరిగి అతడు వినోదరావు వద్దకు వెళ్ళి తన దురదృష్టాన్ని వ్యాపింపచేయ దలచలేదు. ఇలావుండగా పదిరోజుల అనంతరం ఆఫీసులో అతనికి పిడుగులాంటి వార్త చెవినిపడింది వినోదరావు చనిపోయేడని—కాలు మళ్ళీ త్వరత్వరగా దేహమంతా వ్యాపించడంవల్ల డాక్టర్లు ఏమీ చెయ్యలేక పోయారనీ.

విశ్వాసరావు చాలా విచారించేడు. ఆ పదిరోజులూ అతన్ని దర్శించనందుకు దిగులుపడ్డాడు. ఆనాడు ఆఫీసులో ఎవరి నోట విన్నా ఒక్కటేమాట.

"వినోదరావుకి అంత చిన్న వయసులోనే అంత పెద్ద ఉద్యోగమైంది. కాని దురదృష్టవంతుడు—అనుభవించే యోగం లేదు."

విశ్వాసరావు కేమీ పాలుపోలేదు. ప్రమోషన్ వచ్చినా వినోదరావు అనుభవించలేని దురదృష్టవంతుడు తానా, అనుభవించగలిగినా ప్రమోషన్ రాని దురదృష్టవంతుడు - ఇందులో ఎవరెక్కువ దురదృష్టవంతుడు ?? ★